క్లుప్తంగా

ముగిసిన కంప్యూటర్ కోర్సు శిక్షణ



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో సర్పంచ్ దుర్గో, ఎంపీటీసీ సాంబమూర్తి

సీలేరు: సీలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకుడు నూనె రమేష్ నిర్వహించిన వేసవి కంప్యూటర్ తరగతులు శిక్షణ సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి దుర్గో అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని కోరారు. కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ అందించిన రమేష్‌ను అభినందించి సత్కరించారు. ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్ , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మొక్కలు నాటుతున్న నాయకులు ఉమామహేశ్వరరావు, కృష్ణారావు

పాడేరు : కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ ఇ.కొత్తూరు గ్రామంలో సోమవారం పీఎం జుగ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గిరిజనులకు వివరించారు. అనంతరం మొక్కలను నాటారు. రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, సర్పంచ్ అశ్విజ, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బాయమ్మ, నాయకుడు గోపాలపాత్రుడు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు భానుప్రకాశ్, ప్రోగ్రాం ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన విద్యార్థుల కిట్లు



మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరిన కిట్లు

చింతపల్లి: మండలంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు షూలు(బూట్లు) విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. ఇందులో భాగంగా మండలంలో గల 13,827 విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యాయి. మంగళవారం నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంఈవో-2 గెమ్మిలి బోడం నాయుడు తెలిపారు.

ఏవోగా భాను ప్రియాంక నియామకం



కొయ్యూరు: మండల వ్యవసాయ అధికారిగా భాను ప్రియాంక టెక్కలి నుంచి బదిలీపై వస్తున్నారు. ఇప్పటివరకు ఏవోగా పనిచేసిన ఉమాదేవికి విశాఖపట్నం బదిలీ అయింది. ఆమె స్థానంలో భాను ప్రియాంక బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమాదేవి రెండు సంవత్సరాల పాటు ఏవోగా విధులు నిర్వహించి, మంచి పేరు తెచ్చుకున్నారు.

నేటి నుంచి గ్రామసభలు



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: పీవీటీజీ గ్రామాల్లో మంగళవారం నుంచి జరుగనున్న గ్రామసభల షెడ్యూల్‌ను ఎంపీడీవో యాదగిరిఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 17న బడదనాంపల్లిలో, 18న బోర్నగూడెం, చెరకుంపాలెంలో, 19న చికిలింత, కరుదేవపాలెంలో, 20న దోనెలపాలెంలో, 23న కింద్రలో, 24న కొండపల్లిలో, 25న లాగరాయిలో, 26న ఉర్లాకులపాడులో, 27న శరభవరం, 28న సింగంపల్లిలో, 30న వాతంగిలో గ్రామసభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డుల గుర్తింపుతో పాటు పక్కా గృహాల కోసం మౌలిక వసతులు గుర్తించేందుకు ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

అడుగంటిన జలాశయం

- వట్టిగెడ్డ కాల్వల్లో పేరుకుపోయిన పూడిక
- ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



వట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



అడుగంటిన వట్టిగెడ్డ రిజర్వాయర్ (నేడు)

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట శివారులో గల వట్టిగెడ్డ జలాశయం ఓ వైపు వర్షాభావ సరిస్థితులు, మరో వైపు మరమ్మతుల కారణంగా దాదాపు అడుగంటింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు ప్రశ్నార్థకమే అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాధారంగానే సాగు చేపట్టాల్సి వస్తుందని అంటున్నారు. ఈ రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 16 అడుగులు కాగా ప్రస్తుతం అర అడుగు నీరు మాత్రమే ఉంది. ఈ రిజర్వాయర్‌కు గల షట్టర్ (తలుపులు) తుప్పుపట్టి రంధ్రాలు పడడంతో చెరువు గర్భంలోని నీరు ఎప్పటికప్పుడే దిగువకు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా దాదాపు 200 ఎకరాలు కాగా రిజర్వాయర్ గర్భం పూడికకు లోను కావవడం మా పాలిట శాపంగా మారిందని రైతులు చెబుతున్నారు. పూడికకు లోను కావడం వల్ల రిజర్వాయ్ నీటి నిల్వ సామర్థ్యం కూడా కోల్పోయిందంటున్నారు. గతంలో ఈ రిజర్వాయర్‌కు నీరు చెట్టు పథకంలో పూడిక తీతకు నిధులు మంజూరు అయినప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో ఆ నిధులు మురిగిపోయాయి. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వట్టిగెడ్డ రిజర్వాయర్ 5 గ్రామాలకు చెందిన సుమారు 3వేల ఎకరాలకు సాగునీరందిస్తోంది. వరి నాట్లు వేసే సమయంలో వర్షాలకు తోడు ఈ రిజర్వాయర్ నుంచి వచ్చే సాగునీరు రైతులకు ఎంతో ఉపయోగం. అయితే ఈ ఏడాది రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోవడంతో ఖరీఫ్ వరి సాగు ప్రశ్నార్థకంగా మారిందని, వర్షాలు కురిస్తేనే నాట్లు పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ రిజర్వాయర్ ప్రధాన పంట కాలువకు చెందిన షట్టర్(తలుపులు) మరమ్మతుకు లోను కావడంతో పొలాలకు నీరు వదిలిపెట్టాలన్నా. రిజర్వాయర్‌లోని నీరు నిల్వ చేయాలన్నా వీలుకాకుండా ఉన్నట్టు ఆయకట్టు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మైనర్ ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి నాట్లు వేసేలోగా కనీసం ఈ రిజర్వాయర్‌కు చెందిన షట్టర్ మరమ్మత్తు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది ఈ రిజర్వాయర్‌ను పరిశీలించిన మైనర్ ఇరిగేషన్ అధికారులు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి రూ. 36 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. కాగా ఆ నిధులు విడుదల కాకపోవడం కూడా ఈ ప్రాంత రైతులకు ఆశనిపాతంగా మారింది.



గతేడాది వర్షాలు మెండుగా కురవడంతో నిండుకుండలా వట్టిగెడ్డ రిజర్వాయర్ (నాడు)

ఈ విషయంపై వివరణ కోరేందుకు స్పెషల్ మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం.

జగన్నాథ రథయాత్రకు ముమ్మరంగా ఏర్పాట్లు



దార్రెలలో రథం తయారీలో గ్రామస్తులు

ముంచంగిపుట్టు: దార్రెలలో ఈ నెల 27వ తేదిన జరిగే జగన్నాథస్వామి రథయాత్రకు పలు గ్రామాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దార్రెల పంచాయతీ కేంద్రంలో గ్రామస్తులు రథయాత్రకు నూతన రథం తయారీ చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఉన్న రథం పాడైపోవడంతో కొత్త చెక్కతో రథాన్ని చూడ చక్కని విధంగా తీర్చిదిద్దుతున్నారు. మరి కొన్ని రోజుల్లో రథం పూర్తి చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏడాది దార్రెల, కొండపడ గ్రామాల్లో జగన్నాథ రథయాత్రను భారీ స్థాయిలో నిర్వహిస్తారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లును ఆయా గ్రామ గిరిజనులు సోమవారం ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రథయాత్ర నిర్వాహకులు తెలిపారు.

వాటర్ ట్యాంకులు ప్రారంభం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు చంద్రయ్య, సత్తిబాబు తదితరులు

చింతూరు: మండలంలోని తాటిలంక, నర్సింగపేట, కలిగొండ గిరిజన గ్రామాల్లో క్యూబ్‌వైస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, సమారిటన్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మినీ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. వీటిని సోమవారం సర్పంచ్‌లు పాయం చంద్రయ్య, సవలం సత్తిబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సంస్థ డైరెక్టర్ రామ్‌కుమార్, శంకర్, సీతయ్య, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతర ప్రారంభం



గంగవరంలో గంగాలమ్మ జాతర సందడి

గంగవరం : వర్షాలు బాగా పడి వ్యవసాయ సాగు బాగా జరిగి అధిక దిగుబడులు రావాలని కోరుతూ గిరిజన గ్రామాల్లో ప్రతీ ఏటా గంగాలమ్మ జాతరలను ఘనంగా నిర్వహిస్తారు. మండల కేంద్రమైన గంగవరంలో ఈ జాతరను సోమవారం నుంచి మంగళవారం వరకు రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. జాతర సందడి గంగవరంలో ప్రారంభమైయింది. స్థానిక గిరిజన పెద్దలు, యువకులు గంగాలమ్మ జాతర ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బ్యాంక్ వీధిలో గిరిజన మహిళలు, యువత కోలాటం, సంప్రదాయ నృత్యాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి సర్పంచ్ కలుముల అక్కమ్మ, వార్డు సభ్యులు పండమ్మ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలతోనే రేషన్ పంపిణీకి డిమాండ్



అరకులోయలో నిరసన తెలుపుతున్న గిరిజనులు



ముంచంగిపుట్టులో రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నేతలు



గెమ్మెలిలో ధర్నా చేస్తున్న నాయకులు

అరకులోయటౌన్: ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బస్కీ,బొండాం, చినలబుడు, గన్నెల, మాదల పంచాయతీల పరిధిలోని కంజరితోట, దొరవలస, జయంతివలస, చీడివలస, దాబుగుడ గ్రామాల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఆర్ డిపోల ద్వారా రేషన్ పంపిణీ చేయడం వలన కార్డుదారులు సుదూర ప్రాంతాలకు కాలినడకన వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో మాదిరిగా ఎండియూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే బియ్యంతో పాటు ఇతర రేషన్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బుజ్జిబాబు, సుబ్బారావు, పరశురాం, రమేష్, అప్పలస్వామి, మల్లన్న, కన్నయ్య, సింహాద్రి, సోమన్న, ప్రమీల, అప్పలమ్మ, లక్ష్మీ, రాధ, తులవతి, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం రేషన్ సరకులు పంపిణీలో తీసుకున్న నిర్ణయం గిరిజన పాలిట శాపంగా మారుతూ అష్టకష్టాలకు గురిచేస్తుందని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను అన్నారు. ఈ మేరకు రేషన్‌దారులకు మద్దతుగా గిరిజన సంఘం నేతలు సోమవారం తహసీల్దార్ కార్యలయానికి వెళ్లి ఎండీయూ వాహనాలతో పాత పద్దతిలోనే గిరిజన ప్రాంతంలో రేషన్ సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజనులను కష్టాలకు గురిచేయడం తగదన్నారు. గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రభుత్వంపై గొప్పలు చెప్పడం తప్ప గిరిజనుల సమస్యలు పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, గిరిజన సంఘం నేతలు భీమరాజు, నారాయణ, గాసిరాం దొర తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఎండీయు వాహనాల ద్వారా రేషన్‌దారులకు సరుకులు పంపిణీ పునరుద్ధరించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వనుగు సన్యాసిదొర డిమాండ్ చేశారు. గెమ్మెలి డీఆర్ డిపో వద్ద ధర్నా చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



చంద్రారెడ్డి(ఫైల్)

వై.రామవరం: మండల కర్షక పరిషత్ మాజీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెదుళ్ల చంద్రారెడ్డి (75) అనారోగ్యంతో మండలంలోని తన స్వగ్రామం రేగడిపాలెంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బత్తుల సత్యనారాయణతో పాటు నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం కలిసి సంతాపం తెలిపారు. చంద్రారెడ్డి పార్టీ కోసం చేసిన సేవలను గుర్తు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయటౌన్: మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.సీహెచ్.పాత్రుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం 33/11 కేవీలో కొత్త ఫీడర్ బ్రేకర్ పనులు నిమిత్తం, అరకులోయలోని 11 కేవి అంజోడ ఫీడర్ పరిధిలో స్తంభాల ఏర్పాటులో భాగంగా ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి చేయనున్నట్టు తెలిపారు. ఈ కారణంగా పెదలబుడు, చినలబుడు, చొంపి, సుంకరమెట్ట, శిరగాం, లోతేరు, మాడగడ, మాదల, బస్కీ బొండాం, గన్నెల, ఇరగాయి, పద్మాపురం, కొత్తభల్లుగుడ పంచాయతీలతో పాటు డుంబ్రిగుడ మండలం అరకు పంచాయతీ కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పశు వ్యాధులపై అప్రమత్తం



గణేష్, అడ్డతీగల ఏడీ

అడ్డతీగల: పశువులకు సంక్రమించే వివిధ రకాల రుగ్మతల నివారణకు విస్తృతంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ అడ్డతీగల ఏడీ సీహెచ్ గణేష్ తెలిపారు. పశువులకు ఈ సీజన్‌లో సంక్రమించే కంటి వాపు రాకుండా, జబ్బవాపు నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నట్టు చెప్పారు. పశువ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీటితో పాటు 50 శాతం రాయితీపై పశువులకు దాణా పంపిణీ చేస్తున్నామన్నారు.బలవర్ధకమైన ఆహారం ద్వారా పాల దిగుబడి పెరుగుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న దాణా తీసుకువెళ్లి పశువులకు ఇవ్వాలన్నారు.

బ్యాంకులు కిటకిట

సీలేరు: జి.కె.వీధీ మండలం సీలేరు యూనియన్ బ్యాంకు వద్ద సోమవారం ఉదయం లబ్ధిదారులతో కిటకిటలాడింది. గడిచిన రెండు రోజులుగా బ్యాంకుకు సెలవులు వచ్చాయి. దీంతో బ్యాంకుకు వివిధ పనుల నిమిత్తం ఖాతాదారులు తరలివచ్చారు. దీంతోపాటు తల్లికి వందనం సొమ్ము జమ అయిన పలువురు లబ్ధిదారులు కూడా వచ్చారు. దీంతో బ్యాంకు కిటకిటలాడింది.

సాంబ శివుని కల్యాణోత్సవం రేపు

కొయ్యూరు: కస్పావీధిలోని ఉమా సాంబశివుని ఆలయంలో ఈ నెల 18న సాంబ శివుని కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు ప్రసాద్ తెలిపారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో అందంగా అలంకరించి సంప్రదాయంగా ఏపీ అర్చక ఎగ్జామినర్ శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా కల్యాణం జరిపించనున్నట్లు చెప్పారు.

తహసీల్దార్‌కు వీఆర్ఏల వినతి



తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పెదబయలు: గ్రామ స్థాయిలో రెవెన్యూ శాఖలో సేవలందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)ల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం పెదబయలు తహసిల్దార్ రంగారావుకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో 19,359 మంది వీఆర్ఏలు పని చేస్తున్నారని, నిత్యం ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా వీఆర్ఏల సమస్యలు ఒక్కటి అమలు చేయడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్నామని, నైట్ వాచ్‌మాన్ డ్యూటీలు,అ టెండర్ డ్యూటీలు చేస్తున్నామని, ఇదే కాకుండా రీ సర్వేకు ఇతర ప్రాంతాలు వెళ్లి పని చేయాల్సి వస్తుందని అదనపు పని భారం పడుతుందని, ఆర్థిక సమస్యలతో జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఎనిమిదేళ్ల నుంచి జీతాలు పెరగలేదన్నారు. తెలంగాణలో వీఆర్ఏలకు పేస్కేల్ ఇచ్చి అక్కడి ప్రభుత్వం ఆదుకుందన్నారు. మన రాష్ట్రంలో కూడ పే స్కేల్ జీతాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే అక్రమ డ్యూటీలు రద్దు చేసి ఎక్కడైతే వాచ్‌మన్.అటెండర్లు ఖాళీలున్నచోట వీఆర్ఏలకు శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. నీలకంఠం, సుందర్‌దేవ్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎటపాక: ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు డాక్టర్ విష్ణుప్రియ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య ఆదేశాలతో నిర్వహించిన ఈ శిబిరంలో పీహెచ్ఎన్ అరుంధతి, హెచ్‌వి సీతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెదవలసలో వైద్య శిబిరం

గూడెంకొత్తవీధి: పెదవలసలో సోమవారం సత్యసాయి సేవా సమితి, గాయత్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు చికిత్స అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

జాతీయస్థాయిలో గుర్తింపు పొందేలా కృషి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: అల్లూరి జిల్లాలోని ఈ ప్రాంతం నుంచి ఒకరైనా జాతీయ స్థాయి క్రికెట్ క్రీడాకారునిగా ఒకరైనా ఎదగాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అభిలషించారు. మండలంలోని అమీనాబాద్ కాలనీలో అమీనాబాద్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ ఈవెంట్‌కు హాజరయ్యారు. విజేతగా నిలిచిన అమీనాబాద్ టీమ్‌కు రూ.20వేలు నగదు, ట్రోఫీ అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన రేవతిపాలెం టీమ్‌కు రూ.10వేల నగదు, ట్రోఫీను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె యువతను ఉద్దేశించి ప్రసంగిస్తు క్రీడల్లో జాతీయస్థాయి గుర్తింపు పొందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జడ్డంగి, అమీనాబాద్ సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, నాయకులు రమేష్, జాన్ బాబు, కుశరాజు, కామేష్, వీరబాబు, నాని, కృష్ణ, శ్రీను, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



చింతూరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు




మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు


పాడేరు : కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మికులంతా ఐక్య పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని మోదకొండమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో సోమవారం సిఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు పోరాడే హక్కును కోల్పోతారన్నారు. పని గంటల పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ భాగ్యలక్ష్మి, కళావతి, పద్మ, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: అంగన్‌వాడీ కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులను సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్మికులకు కూడా తల్లికి వందనం పథకం వర్తింప చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావుకు వారు వినతిపత్రం అందజేశారు. సుబ్బారావు, రాజేశ్వరి, కనక, లలిత, భద్రమ్మ, విజయ, రాములమ్మ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



వనభంగిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీవో తదితరులు



చిన్నగెడ్డలో మాట్లాడుతున్న సర్పంచ్ దురియా పుష్పలత



పనసలపాలెంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

పెదబయలు: మండలంలోని వనభంగి పంచాయతీలో ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో ధర్తి అబ్ జన్‌భగిదరీ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆధార్, రేషన్ కార్డుల నమోదు, వైద్యశిబిరాలు, గృహాల మంజూరుకు అర్హుల గుర్తింపు తదితర కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసి సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, వనభంగి సర్పంచ్ కొర్రా కాసులమ్మ, నాయకులు ధనరాజ్, బాబూరావు, డీటీ ఎస్.వి.రమణ, ఎంఈవో పుష్ప, ఏపీఎం దేవమంగ, హౌసింగ్ ఏఈ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. చిన్నగెడ్డ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఓ శ్రీనివాసరావు, కార్యదర్శి లక్ష్మికాంత్, ఏసీడీపీవో రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం, డొంకరాయి గ్రామాల్లో ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన ధర్తి అబ్ జన్‌భగిదరీ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న గ్రామసభలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.